చైతన్య ఫుడ్ కోర్టుకు నోటీసులు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ నెక్సస్ మాల్ చౌరస్తాలోని చైతన్య ఫుడ్ కోర్టుకు మూసాపేట్ సర్కిల్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పవన్ నోటీసులు ఇచ్చారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే సరిగ్గా ఉడకని బిర్యానీ పంపించారని ఈనెల 10న సంతోష్ నాయుడు అనే వ్యక్తి ట్విట్టర్ (ఎక్స్)లో ఫిర్యాదు చేశారు. జొమాటోలో బిర్యానీ ఆర్డర్ చేయగా సరిగ్గా లేదని, సదరు హోటల్‌పై అక్షన్ తీసుకోవాలని అధికారులకు ఎక్స్ ద్వారా తెలియజేశాడు. వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు. అప్పటికే హోటల్ యాజమాన్యం అలర్ట్ కావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు వచ్చే సమయానికినిబంధనల మేరకు ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిసింది. మూడు రోజుల్లో నిర్వాహకులు సరైన జవాబు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఎమ్మెల్సీ కోదండరామ్ చిత్ర పటానికి క్షీరాభిషేకం



ఎమ్మెల్సీ కోదండరామ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్ఎంపీలతో కాంగ్రెస్ నాయకుడు యాదగిరి

ఓల్డుబోయినపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ డాక్టర్లను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఓల్డుబోయినపల్లి టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి ఆర్ఎంపీలకు హామీ ఇచ్చారు. ఈ నెల 18న ఇందిరాపార్కు వద్ద చేపట్టిన మహా ధర్నాకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ సంపూర్ణమద్దతు తెలిపినందుకు కృతజ్ఞతగా ఓల్డుబోయినపల్లి ఆర్ఎంపీ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం హస్మత్‌పేట చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన కోదండరామ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు అరుణ్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున్ యాదవ్, ఓబీసీ సెల్ నాయకులు శ్రీరాములు, ఆర్ఎంపీ వైద్యులు రాజేంద్ర, భీంరావు, లతీఫ్, రాజు, అరవింద స్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.

నాగదేవత ఆలయంలో సీసీ కెమెరాలు



పోలీస్ అధికారులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

అల్లాపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ వి.రామారావు నగర్‌లోని వినాయక శివపార్వతులు, ప్రసన్నాంజనేయ, నవగ్రహ సమేత నాగదేవత ఆలయ 14వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దినదిన ప్రవర్ధమానమై ఆలయ సమూహం అల్లాపూర్, మోతీనగర్ ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందిందని ఆలయ కమిటీ ప్రతినిధి నాగుల సత్యం పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ అధికారులు సీఐ. శ్రీనివాసులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నర్సింహ, రామకృష్ణ యాదవ్, సుభాష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి బాలయ్య, సాంబశివ, పి.శివయ్య, జి.కిష్టయ్య, గిరి పాల్గొన్నారు.

పెండింగ్ పనులపై సమీక్షా సమావేశం



జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్‌లో ఉన్న పెండింగ్ పనులపై కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి శుక్రవారం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డివిజన్‌లోని సీసీ, బీటీ రోడ్లు, దాసరిబస్తీ కమ్యూనిటీ హాలు, నాలా రిటైనింగ్‌వాల్, శ్మశాన వాటికలో మౌలిక వసతుల పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ ఆశ, అసిస్టెంట్ ఏఈ కవిత, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు పాల్గొన్నారు.

కార్మికుడు అదృశ్యం



విజయ్ ఓరన్

బాలానగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ పని కోసమని బతుకుదెరువును వెతుక్కుంటూ వచ్చిన ఓ వలస కార్మికుడు కనపడకుండా పోయాడు. బాలానగర్ సీఐ టి. నర్సింహరాజు వివరాల ప్రకారం.. ఐడీపీఎల్ ఎస్‌వీఎస్ ప్రాజెక్టులో సోహెల్ అక్తర్ సెంట్రింగ్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. పని ఎక్కువగా ఉండడంతో తన సొంత ఊరు జార్ఖండ్ నుంచి మరో ఏడుమంది కార్మికులను హైదరాబాద్‌కు పనికోసం తీసుకొచ్చాడు. వీరంతా కంపెనీ వాళ్ల ఇచ్చిన గదిలోనే ఉంటున్నారు. ఈ నెల 19న ఏడుగురిలో ఒకరైన విజయ్ ఓరన్ (30) కనపడకుండా పోయాడు. అతని బ్యాగు గదిలోనే ఉంది, సెల్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. అతడి కోసం స్నేహితుల వద్ద వెతికిన ఎలాంటి సమాచారం దొరకలేదు. దీంతో విజయ్ ఆచూకీని కనిపెట్టమని సెంట్రింగ్ కాంట్రాక్టర్ సోహెల్ అక్తర్ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్టు

హైదర్‌నగర్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): ఓ అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.26వేలు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేపీహెచ్‌బీ థర్డ్ ఫేస్ వైన్ షాపు వద్ద ఉన్న అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నారని సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు శుక్రవారం వారిపై దాడి చేసి కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.13, వంకాయ రూ.18, బెండకాయ రూ.45, పచ్చి మిర్చి రూ.28, బజ్జి మిర్చి రూ.18, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.10, బీన్స్ రూ.35, క్యారెట్ రూ.17, గోబి పువ్వు రూ.18, దొండకాయ రూ.40, చిక్కుడు కాయ రూ.40, గోరు చిక్కుడు రూ.40, బీట్‌రూట్ రూ.18, క్యాప్సికం రూ.35, ఆలుగడ్డ రూ.20, కీర రూ.18, దోసకాయ రూ.28, సొరకాయ రూ.20, పొట్లకాయ రూ.20, కంద రూ.60, ఉల్లిపొరక రూ.40, ఉల్లిగడ్డ రూ.35, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.45, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.35, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.40-50,

మునగ కాయలు రూ.08-10, పచ్చిబఠాణి రూ.32, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.180, అల్లం రూ.80, వెల్లుల్లి రూ.160, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.65, కరివేపాకు రూ.100, పర్వల్ రూ.55, పల్లికాయ రూ.60, లోబా రూ.25, ఆ కాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పేట్రేగుతున్న పెట్రోలు దొంగలు..!

బైకు బయట ఉంచాలంటేనే భయపడుతున్న వాహనదారులు



జనప్రియ నగర్‌లో ఓ వీధిలో పార్కు చేసిన వాహనాలు

అల్లాపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ వాహనదారులకు పెట్రోల్ దొంగతనం సమస్య చీకాకు పరుస్తోంది. ఆకతాయిలు, అల్లరి మూకల పనంటూ ఉసూరుమంటున్న వాహనదారులకు తరచూ పెట్రోలు చోరీకి గురవుతుండటంతో ఏదైనా అర్జెంటు పనిమీద బండి తీసుకెళ్దామంటే అది స్టార్టవ్వని పరిస్థితి. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్, వివేకానంద నగర్, తులసీనగర్, గాయత్రీనగర్, లక్ష్మీనగర్, ఫ్రెండ్స్ కాలనీ, న్యూ అల్లాపూర్ మొదలు, హరినగర్, న్యూ రామారావునగర్ వరకు రాత్రి వేళల్లో టూ వీలర్లు ఎక్కువగా ఇంటి బయటే పార్కింగ్ చేస్తారు. ఇలా పార్కు చేసిన బండ్లలో నుంచి పెట్రోల్ తస్కరణకు గురవుతుండడం ఇటీవల కాలంలో ఎక్కువైందని బైకు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తులసీ నగర్‌లో ఇటీవల పెట్రోలు దొంగతనాలు అధికమవడంతో కొందరు తమ ఇంటిముందు అమర్చిన సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించి అతడిని పోలీసులకు అప్పగించారు.

స్కూటర్లు ఒకింత నయం

స్కూటీలు, కొన్ని రకాల బైకులు, ఎలక్ట్రిక్ వాహనాలు పెట్రోలు దొంగల బారినుంచి రక్షణ కల్గి ఉన్నాయనుకోవచ్చు. ఎందుకంటే స్కూటీల నుంచి పెట్రోలు తస్కరించటం అంత సులువు కాదు. విద్యుత్ వాహనాలకు ఆ తావే ఉండదు.అందుచేత పెట్రోలు దొంగలకు బైకులే టార్గెట్.

ఇంట్లోనే పార్క్ చేయడం బెటర్

పెట్రోల్ తస్కరుల బాధ నుంచి వేరే మార్గమే లేక రోజూ రాత్రి బండ్లను ఇళ్లల్లో పార్క్ చేసుకోవాలి. ఇది కాస్త ఇబ్బందికరమే అయినా రూ.110 లీటరు పెట్రోలు కొనే బదులు ఇలా జాగ్రత్త పడితే మేలు.

బండ్లు కూడా ఎత్తుకెళ్తున్నారు



మత్తు పదార్థాలకు అలవాటై కొందరు, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికొచ్చి మరికొందరు ఈ తరహా చిల్లర దొంగతనాలు పాల్పడుతున్నారు. అక్కడక్కడ సీసీ టీవీల్లో రికార్డు అవుతున్నా, ఆ సౌకర్యం అంతటా అందుబాటులో ఉండదు. గాయత్రీనగర్‌లోని 'చిన్నారులు మహిళల పార్కు' నుంచి రైల్వే ట్రాక్ మధ్యన యువకులు కొందరు నిత్యం అనుమానాస్పదంగా సంచరిస్తూ ఉంటారు.

- నార్లపురం శ్రీనివాస్, సామాజిక కార్యకర్త

స్వీయ జాగ్రత్త అవసరం



వాహనదారులు స్వీయ జాగ్రత్త పాటించాలి. రాత్రిళ్లు తమ వాహనాలను సురక్షిత ప్రాంతంలో పార్కు చేసుకోవాలి. సీసీ కెమెరాలు ఉన్న చోటైతే మరీ మంచిది. అక్కడ గస్తీ ఉన్నదన్న సూచికలు ఇస్తే బెటర్.

- బొల్లు శ్రీనివాస్ రావు, అధ్యక్షుడు, వివేకానంద నగర్ కాలనీ (అల్లాపూర్)

పెట్రోల్ వాల్వ్ లాక్ ఓ ఉపాయం

ఈ రకమైన వేదనకు ఉపాయంగా బాధితులు తమ బండ్లలోని పెట్రోల్ ఔట్‌లెట్‌ను తొలగించి వాటిస్థానే తాళంచెవితో పనిచేసే వాల్వ్‌లను అమర్చుకుంటున్నారు. ఇక తాళం చెవి లేనిదే ట్యాంకు నుంచి ట్యూబు ద్వారా ఇంజను సరఫరా ఉండదు. దీంతో దొంగలకు చోరీ చేసేందుకు వీలు పడదు.



ఓ మోటార్‌సైకిల్ పెట్రోల్ ట్యాంక్‌కు అమర్చిన లాక్



ఆదర్శనగర్ కమాండ్ కంట్రోల్‌నుంచి సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతితో డీసీపీ సురేష్‌కుమార్



కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలతో సీపీ మహంతి

సీసీ కెమెరాల నిఘాతో నేరాల నియంత్రణ

సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి

బాలానగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల నిఘాతో నేరాలను నియంత్రించవచ్చునని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. శుక్రవారం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధి ఐడీపీఎల్ ఆదర్శనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కాలనీలో ఏర్పాటు చేసుకున్న 32 సీసీ కెమెరాలను బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్, ఏసీపీ హనుమంతరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, నేరాల నియంత్రణ, దోషులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్రను పోషిస్తాయన్నారు. భద్రత కోసం ప్రతీ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వస్తే అందుకు కావలసిన సాంకేతిక సహకారాన్ని అందజేస్తామన్నారు. ప్రజల రక్షణ, భద్రత కోసం పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై బాలానగర్ సీఐ టి.నర్సింహరాజు నేతృత్వంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు మంచి ఫలితాల నిస్తున్నాయని సీఐను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఆదర్శనగర్‌కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాలానగర్ సీఐ టి. నర్సింహారావు, డీఐ నాగిరెడ్డి, ఎస్సైలు రాంనారాయణ్, సరళ, హాజీమియా, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శంకరయ్య, దుర్గ, ఆంజనేయులు, రవికుమార్, నాగభూషణం, నాంచారమ్మ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు వాకర్స్, యోగా టీం



మహా కుంభమేళాకు తీసుకెళ్తున్న పాతూర్ వేణుగోపాల్‌కు సత్కారం

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ వాకర్స్ అండ్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో 34 మంది మహాకుంభమేళాకు బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు శుక్రవారం రమ్యగ్రౌండ్ మిత్రబృందం సభ్యులు యోగా అసోసియేషన్ అధ్యక్షులు పాతూర్ వేణుగోపాల్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. పవిత్ర స్నానాలు చేయాలన్న సభ్యుల కోరిక మేరకు మహాకుంభమేళాకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. వారం రోజుల పాటు తీర్థయాత్ర ఉంటుందని పేర్కొన్నారు.

విద్యుత్ మొండి బకాయిలపై స్పెషల్ డ్రైవ్

టీజీఎస్‌పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీఈ పాండ్య

కేపీహెచ్‌బీకాలనీ/అల్లాపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థకు అండగా నిలవాలని టీజీఎస్‌పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీఈ పాండ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం అల్లాపూర్ సెక్షన్ పరిధిలో సీఈ ఆకస్మిక పర్యటన చేశారు. పెండింగ్ బకాయిలపై ప్రత్యేక డ్రైవ్ పనితీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రూ.50 వేల పైబడి బకాయిలు ఉన్న కనెక్షన్ల సర్వీసులను తొలగించడంతో రూ.5లక్షల వరకు వసూళ్లయ్యాయని జీఎం అంజయ్య, డీఈ శ్యాంకుమార్ వివరించారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, రంగారెడ్డి జోన్ పరిధిలోని సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్‌లో రూ.38కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని సీఈ తెలిపారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు బకాయిలను రాబట్టేందుకు క్షేత్రస్థాయిలో ఏఈ, ఏఈడీఈ, డీఈ, జీఎం సర్వీసులను పరిశీలించి పెండింగ్ బకాయిలను రాబట్టాలని సీఈ ఆదేశాలు జారీ చేశారు.



అల్లాపూర్‌లో పెండింగ్‌లో ఉన్న కనెక్షన్ల గురించి ఆరా తీస్తున్న సీఈ పాండ్య

ఎమ్మెల్యేకు అభినందనలు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మహా కుంభమేళాకు వెళ్లిన సందర్భంగా అక్కడే జన్మదినం గడిచిపోయింది. తిరిగొచ్చాక తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వారు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పలు శుభకార్యాలకు హాజరయ్యారు. ఈక్రమంలో వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వెంట కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో..

ఓల్డుబోయినపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజు నాడు ఎమ్మెల్యే కృష్ణారావు అందుబాటులో లేకపోవడంతో కుంభమేళా నుంచి తిరిగి వచ్చిన కృష్ణారావును క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకుడు మేకల హరినాథ్ కలిసి శుభా కాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే కు జ్ఞాపికను అందజేస్తున్న స్థానికులు

స్టాండింగ్ కౌన్సిల్ బరినుంచి తప్పుకున్న జూపల్లి



కూకట్‌పల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా బీఆర్ఎస్ పార్టీ నుంచి నామినేషన్ వేసిన కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణరావు శుక్రవారం పోటీనుంచి తప్పుకున్నారు.

అధిష్టానం ఆదేశాల మేరకే విత్ డ్రా చేసుకున్నట్లు ఆయన ధ్రువీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ రాబోయే రోజుల్లో అధికారంలోకి తప్పక వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, ఏఐఐఎమ్, కాంగ్రెస్‌లు లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని ప్రజలు అన్ని గమనిస్తున్నారని తెలిపారు.

జీహెచ్ఎంసీ కార్పొరేటర్ ఎన్నికలు మరి కొన్ని నెలల్లో రాబోతున్నాయని, అందులో బీఆర్ఎస్ అత్యధికసీట్లు గెలుచుకుని సత్తా చాటుతుందని అన్నారు.

'అడ్వాన్స్‌డ్ ఫిజిక్స్'తో అనేక సమస్యలకు పరిష్కారం

- ప్రొఫెసర్ ఎస్ఏ హష్మీ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వక్తలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నిజ జీవితంలో అడ్వాన్స్‌డ్ అప్లయిడ్ ఫిజిక్స్ ను వినియోగించి అనేక సమస్యలకు పరిష్కారాలు చూపవచ్చని ఢిల్లీ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ ప్రొఫెసర్ ఎస్ఏ హష్మీ అన్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో నిర్వహించిన అడ్వాన్సెస్ ఇన్ అప్లయిడ్ ఫిజిక్స్ అంతర్జాతీయ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అప్లయిడ్ ఫిజిక్స్‌పై పరిశోధన ఫలితాలను యూ నివర్సిటీలు పరస్పరం ఇచ్చి పుచ్చుకోవాలన్నారు. దీనికోసం మౌలానా యూనివర్సిటీ వేదికను ఏర్పాటు చేయడం మంచి విషయమన్నారు. ఈ సదస్సులో మనూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ పీఎఫ్ రహమాన్, ప్రొఫెసర్ మహ్మద్ రఫీక్ అబుతాలిబ్, ప్రొఫెసర్ అలీమ్ హెచ్‌బాష, డాక్టర్ మహ్మద్ సిద్దిఖీ పాల్గొన్నారు.

పేట్రేగుతున్న పెట్రోలు దొంగలు..!

బైకు బయట ఉంచాలంటేనే భయపడుతున్న వాహనదారులు



జనప్రియ నగర్‌లో ఓ వీధిలో పార్కు చేసిన వాహనాలు

అల్లాపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ వాహనదారులకు పెట్రోల్ దొంగతనం సమస్య చీకాకు పరుస్తోంది. ఆకతాయిలు, అల్లరి మూకల పనంటూ ఉసూరుమంటున్న వాహనదారులకు తరచూ పెట్రోలు చోరీకి గురవుతుండటంతో ఏదైనా అర్జెంటు పనిమీద బండి తీసుకెళ్దామంటే అది స్టార్టవ్వని పరిస్థితి. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్, వివేకానంద నగర్, తులసీనగర్, గాయత్రీనగర్, లక్ష్మీనగర్, ఫ్రెండ్స్ కాలనీ, న్యూ అల్లాపూర్ మొదలు, హరినగర్, న్యూ రామారావునగర్ వరకు రాత్రి వేళల్లో టూ వీలర్లు ఎక్కువగా ఇంటి బయటే పార్కింగ్ చేస్తారు. ఇలా పార్కు చేసిన బండ్లలో నుంచి పెట్రోల్ తస్కరణకు గురవుతుండడం ఇటీవల కాలంలో ఎక్కువైందని బైకు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తులసీ నగర్‌లో ఇటీవల పెట్రోలు దొంగతనాలు అధికమవడంతో కొందరు తమ ఇంటిముందు అమర్చిన సీసీ టీవీ పుటేజీని పరిశీలించి అతడిని పోలీసులకు అప్పగించారు.

స్కూటర్లు ఒకింత నయం

స్కూటీలు, కొన్ని రకాల బైకులు, ఎలక్ట్రిక్ వాహనాలు పెట్రోలు దొంగల బారినుంచి రక్షణ కల్గి ఉన్నాయనుకోవచ్చు. ఎందుకంటే స్కూటీల నుంచి పెట్రోలు తస్కరించటం అంత సులువు కాదు. విద్యుత్ వాహనాలకు ఆ తావే ఉండదు.అందుచేత పెట్రోలు దొంగలకు బైకులే టార్గెట్.

ఇంట్లోనే పార్క్ చేయడం బెటర్

పెట్రోల్ తస్కరుల బాధ నుంచి వేరే మార్గమే లేక రోజూ రాత్రి బండ్లను ఇళ్లల్లో పార్క్ చేసుకోవాలి. ఇది కాస్త ఇబ్బంది కరమే అయినా రూ.110 లీటరు పెట్రోలు కొనే బదులు ఇలా జాగ్రత్త పడితే మేలు.

బండ్లు కూడా ఎత్తుకెళ్తున్నారు



మత్తు పదార్థాలకు అలవాటై కొందరు, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికొచ్చి మరికొందరు ఈ తరహా చిల్లర దొంగతనాలు పాల్పడుతున్నారు. అక్కడక్కడ సీసీ టీవీల్లో రికార్డు అవుతున్నా, ఆ సౌకర్యం అంతటా అందుబాటులో ఉండదు. గాయత్రీనగర్‌లోని 'చిన్నారులు మహిళల పార్కు' నుంచి రైల్వే ట్రాక్ మధ్యన యువకులు కొందరు నిత్యం అనుమానాస్పదంగా సంచరిస్తూ ఉంటారు.

\- నార్లపురం శ్రీనివాస్, సామాజిక కార్యకర్త

స్వీయ జాగ్రత్త అవసరం



వాహనదారులు స్వీయ జాగ్రత్త పాటించాలి. రాత్రిళ్ల తమ వాహనాలను సురక్షిత ప్రాంతంలో పార్కు చేసుకోవాలి. సీసీ కెమెరాలు ఉన్న చోటైతే మరీ మంచిది. అక్కడ గస్తీ ఉన్నదన్న సూచికలు ఇస్తే బెటర్.

\- బొల్లు శ్రీనివాస్ రావు, అధ్యక్షుడు, వివేకానంద నగర్ కాలనీ (అల్లాపూర్)

పెట్రోల్ వాల్వ్ లాక్ ఓ ఉపాయం

ఈ రకమైన వేదనకు ఉపాయంగా బాధితులు తమ బండ్లలోని పెట్రోల్ ఔట్‌లెట్‌ను తొలగించి వాటిస్థానే తాళం చెవితో పనిచేసే వాల్వ్‌లను అమర్చుకుంటున్నారు. ఇక తాళం చెవి లేనిదే ట్యాంకు నుంచి ట్యూబు ద్వారా ఇంజను సరఫరా ఉండదు. దీంతో దొంగలకు చోరీ చేసేందుకు వీలు పడదు.



ఓ మోటార్‌సైకిల్ పెట్రోల్ ట్యాంక్‌కు అమర్చిన లాక్



ఫంక్షన్‌హాల్ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఫంక్షన్‌హాల్, చిల్డ్రన్స్ పార్కు పనుల పరిశీలన

హైదర్‌నగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్ నగర్‌లో రూ.2కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే ఫంక్షన్‌హాల్, కోటి రూపాయలతో చేపట్టబోయే చిల్డ్రన్స్ పార్కు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ ఈఈ గోవర్ధన్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పీజేఆర్‌నగర్‌లో జరుగుతున్న చిల్డ్రన్స్ పార్కు, మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పీజేఆర్‌నగర్ కాలనీవాసుల చిరకాల కోరిక త్వరలో నెరవేరుతుందన్నారు. సకల సౌకర్యాలతో ఫంక్షన్‌హాళ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అదేవిధంగా చిల్డ్రన్స్ పార్కు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, నాణ్యత ప్రమాణాలతో చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దొడ్ల రామకృష్ణగౌడ్, అనిల్‌రెడ్డి, వెంకట్‌నాయక్, పోశెట్టిగౌడ్, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు డీఈఈ రమేష్, ఏఈ శ్రావణి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.



జగదీశ్వర్‌గౌడ్‌ను గజమాలతో సత్కరిస్తున్న ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

జగదీశ్వర్‌గౌడ్‌కు సత్కారం

హైదర్‌నగర్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌ను శుక్రవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారి శశిధర్ గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్‌రావు, బాబ్జీ, ప్రేమ్‌చంద్, దుర్గ, నాగమణి, మనీషా, సుజాత, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా జగదీశ్వర్ గౌడ్

మియాపూర్,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): నూతన గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ పదేళ్ల తర్వాత గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీగా ఏకగ్రీవంగా ఎన్నికవడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని, తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కారమయ్యేలా కృషిచేస్తానన్నారు.



సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్, జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ శ్రవణ్‌రెడ్డి

కులగణనపై అవగాహన

రాయదుర్గం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): కొండాపూర్ అంజయ్యనగర్ వార్డు కార్యాలయంలో శుక్రవారం కులగణన అవగాహన క్యాక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్, జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ శ్రవణ్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ సిబ్బంది హాజరయ్యారు. కుల గణనపై అవగాహన పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కార్యక్రమాలపై చర్చించారు. ఈ కులగణన ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం లబ్ధిదారులకు అందించడం ఎలా సాధ్యమౌతుందో వివరించారు.

పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్టు

హైదర్‌నగర్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): ఓ అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.26వేలు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేపీహెచ్‌బీ థర్డ్ ఫేస్ వైన్ షాపు వద్ద ఉన్న అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నారని సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం వారిపై దాడి చేసి కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

74 ఏళ్ల మహిళకు చికిత్స విజయవంతం

రోబోటిక్ సర్జికల్ సాయంతో పెద్దపేగు నుంచి పెద్ద కణితిని తొలగించిన వైద్యులు

రాయదుర్గం,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి నానక్‌రాంగూడలో కాంటినెంటల్ ఆస్పత్రిలో శుక్రవారం ఎస్‌ఎస్‌ఐ మంత్ర రోబోటిక్ సర్జికల్ ప్లాట్‌ఫామ్ సహాయంతో 74 ఏళ్ల మహిళ పెద్దపేగు నుంచి పెద్ద కణితిని వైద్యులు తొలగించారు. ఈ శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలను డాక్టర్ కౌశిక్ వెల్లడించారు. మహిళ రోగికి మలద్వారం దగ్గర రక్తస్రావం వంటి లక్షణాలు ఉండటంతో పరీక్షలు నిర్వహించగా తనకు క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఆమెకు ఇంతకుముందు హిస్టరెక్టమీ శస్త్రచికిత్స కూడా జరిగింది. అలాగే రక్తపోటు సమస్య కూడా ఉంది. దీంతో డాక్టర్ మధుసూదన్‌రెడ్డి టీమ్‌తో కలిసి రోబోటిక్ నోసి విధానం ఎంచుకోవడం జరిగిందన్నారు. తద్వారా శస్త్రచికిత్స వల్ల కలిగే గాయాలను తగ్గించి త్వరితగతిన మెరుగుదల సాధించగలమన్నారు. ట్యూమర్ రోబోటిక్ రిసెక్షన్ అనంతరం వెజైనల్ ఓపెనింగ్ ద్వారా తొలగించడం జరిగిందని, దీని వల్ల బయటి పొత్తికడుపులో ఏ విధమైన గాయం కాలేదని వివరించారు. ఈ విధానం ద్వారా తక్కువ నొప్పితో చిన్నచిన్న గాయాలతో త్వరితగతిన ఆస్పత్రి నుంచి డిస్చార్జ్ అవ్వడంతో పాటు తక్కువ సమయంలో సాధారణ జీవితానికి తిరిగి రావచ్చన్నారు. ఈ చికిత్స భవిష్యత్‌లో అబ్డామినల్ హెర్నియా, ఇన్సిషన్ సబంధిత సమస్యలు, ఇతర రిస్కులను తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్‌రెడ్డి ఈ శస్త్రచికిత్స విజయాన్ని గొప్పగా అభివర్ణించి, వైద్యబృందాన్ని అభినందించారు.



కణితిని తొలగిస్తున్న వైద్యులు

నాలాల విస్తరణతో..

వరదముంపు సమస్యకు పరిష్కారం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎస్‌ఎన్‌డీపీ ఫేస్-2లో రూ.79.58 కోట్ల అంచనా వ్యయంతో నాలాల విస్తరణ పనులు చేపట్టడంతో ఎన్నో ఏళ్ల వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లయిందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కొండాపూర్ డివిజన్ గఫూర్‌నగర్‌లో శుక్రవారం రూ.11.55 కోట్లతో నూతనంగా చేపట్టబోయే వరదనీటి కాల్వ పనులకు కార్పొరేటర్ హమీద్‌పటేల్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గఫూర్‌నగర్ కాలనీ నుంచి దుర్గం చెరువు వరకు నాలా విస్తీర్ణ, ఆర్‌సీసీ బెడ్, సైడ్‌వాల్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఒకప్పుడు అధిక వర్షం కురిస్తే కంటిమీద కునుకులేకుండా ప్రజలు తీవ్ర ఆందోళనతో ఇబ్బందులకు గురయ్యేవారని కానీ నేడు ఆ సమస్య మళ్లీ పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాలాల విస్తీర్ణ పనులతో లోతట్టు ముంపు ప్రాంతాలకు ఉపశమనం లభించిందన్నారు. పనుల్లో వేగంపెంచి త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పనులు జరిగే సమయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలన్నారు. నాలాల నిర్మాణ సమయంలో నీటి ప్రవాహం సాఫీగా సాగేలా లెవల్స్‌ను నిర్ధారించుకొని పనులు చేపట్టాలన్నారు. రాబోయే వర్షాకాలం లోపు పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎన్‌డీపీ అధికారులు డీఈ రాజు, ఏఈ నిఖిల్, మాజీ కార్పొరేటర్ రవీందర్‌ముదిరాజ్, నాయకులు ఉట్ల కృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌చౌదరి, తిరుపతి, శ్రావణ్‌యాదవ్, దశరథ్, రజనీకాంత్, శ్రీనివాస్, కావూరి అనిల్, నరేష్, వినయ్ స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



గఫూర్‌నగర్‌లో వరదనీటి కాల్వ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి, కార్పొరేటర్ హమీద్‌పటేల్

మతిస్థిమితం లేని మహిళ కిడ్నాప్ కలకలం

- స్కూటీపై ఎత్తుకెళ్లిన ఇద్దరు దుండగులు
- అత్యాచారం చేసి వదిలి వెళ్లినట్లు అనుమానం
- ఆస్పత్రికి తరలించిన పోలీసులు

మియాపూర్ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నిలబడిన మతిస్థిమితం లేని మహిళను బైక్‌పై ఇద్దరు వ్యక్తులు బలవంతంగా ఎత్తు కెళ్లిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మియాపూర్ బొల్లారం క్రాస్ రోడ్డులో బస్టాప్ దగ్గర ఓ మహిళ (38) శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో నిలబడి ఉండగా, ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వచ్చి బలవంతంగా ఆమెను స్కూటీ ఎక్కించుకున్నారు. ఆమెను బొల్లారం వైపు తీసుకెళ్తుండగా అక్కడ ఉన్న ఓ ఆటో డ్రైవర్ అనుమానించి 100కు సమాచారం అందించాడు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు మహిళను బ్లూ కలర్ స్కూటీపై తీసుకెళ్లినట్లు గమనించారు.

పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి వారి కోసం వెతకడం ప్రారంభించారు. మహిళ బొల్లారంలో రోడ్డుపై తిరుగుతుండగా పోలీసులు గమనించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మహిళను పేరు, నివాసం, ఎవరు? ఎక్కడికి తీసుకెళ్లారని అరాతీయగా ఆమె ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. దాంతో మహిళ మానసిక పరిస్థితి సరిగా లేదని పోలీసులు గుర్తించారు. కిడ్నాప్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మహిళను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసి వదిలేసి ఉండవచ్చని అనుమానించి, ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సీసీ కెమెరాల ఆధారంగా ఇద్దరు నిందితులను మియాపూర్ పోలీసులు అరెస్టు చేసి విచారిస్తునట్లు సమాచారం. మహిళ కూకట్‌పల్లి ప్రాంతానికి చెందినదిగా గుర్తించారు. మానసికి స్థితి సరిగా లేని ఆమె కొన్ని రోజులుగా బస్టాప్‌లలో ఉంటూ, రోడ్లపై తిరుగుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు.


సాంకేతిక అనుసంధానంతో మాతృభాషలను కాపాడుకోవాలి


ఆచార్య పిల్లలమర్రి రాములు


రాయదుర్గం,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): తెలుగుభాషను సాంకేతిక పరిజ్ఞానంతో సమన్వయం చేసుకుంటూ సమకాలిన సామాజిక అవసరాలకు అనుగుణంగా మార్చుకొన్నంత వరకూ మాతృభాషలు అంతరించవని హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు అన్నారు. తెలుగుశాఖలో శుక్రవారం ఆయన అధ్యక్షతన అంతర్జాతీయ మాతృభాష కోసం తూర్పు పాకిస్తాన్ లో ప్రాణాలర్పించిన ఉద్యమ కారుల త్యాగాన్ని వివరించారు. ఆ సంఘటన కారణంగానే యునెస్కో ప్రతి ఏడాది ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించిందని తెలిపారు. ప్రపంచంతో అనుసంధానం కోసం మాతృభాషలతో పాటు కొన్ని ముఖ్య భాషలను కూడా నేర్చుకొంటూ దానికి సాంకేతికతను అనుసంధానం చేసుకోవాలన్నారు. ఆ విషయంలో హైదరాబాద్ విశ్వ విద్యాలయం తెలుగుశాఖ కృషిచేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లోను ఆ కృషికొనసాగుతుందని తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య షమ్మి పవన్‌కుమార్, ఆచార్య వారిజారాణి, త్రివేణి వంగరి, భూక్యా తిరుపతి, డాక్టర్ పి.విజయకుమార్, బాశెట్టి లత తమ ప్రసంగంలో పేర్కొన్నారు.



మాట్లాడుతున్న హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు









రాబిన్‌డేవిడ్ శిల్పకళా ఖండాలు

ఆకట్టుకున్న రాబిన్‌డేవిడ్ శిల్పకళా ప్రదర్శన

రాయదుర్గం,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శిల్పకళాకారుడు రాబిన్‌డేవిడ్ ప్రదర్శించిన శిల్పాకళా ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. శిల్పం అదృశ్యరూపాలను కనిపించే రూపాలతో నవనంగా తీర్చిదిద్దే రాబిన్ డేవిడ్ స్కల్పింగ్ వాయిడ్స్ ఎగ్జిబిషన్ మాదాపూర్ ఫినిక్స్ ఎరినా ప్రాంగణంలో ప్రారంభించిన ఈ ప్రదర్శన శిల్పకళా ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. శిల్పంలో రూపం, శూన్యత మధ్య సంబంధాన్ని అన్వేషించడం అనే రాబిన్ డేవిడ్ శిల్పకళలో కనిపిస్తుందని పలువురు సందర్శకులు పేర్కొన్నారు. భౌతిక శిల్పాలు చేసేంతగా భావోద్వేగాలను ఎలా రేకెత్తిస్తాయో ఈ ఎగ్జిబిషన్‌లోని శిల్పకళా సౌందర్యం అలా సందర్శకుల మదిని కదిలించింది. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శంచిన రాబిన్ డేవిడ్ శిల్పకళలు సందర్శకులను అమితంగా ఆకట్టుకున్నాయి.



మనూ అంతర్జాతీయ సదస్సులో అడ్వాన్సెస్ ఇన్ అప్లయిడ్ ఫిజిక్స్ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వక్తలు

'అడ్వాన్స్‌డ్ ఫిజిక్స్'తో అనేక సమస్యలకు పరిష్కారం

ప్రొఫెసర్ ఎస్‌ఏ హష్మీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నిజ జీవితంలో అడ్వాన్స్‌డ్ అప్లయిడ్ ఫిజిక్స్ ను వినియోగించి అనేక సమస్యలకు పరిష్కారాలు చూపవచ్చని ఢిల్లీ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ ప్రొఫెసర్ ఎస్‌ఏ హష్మీ అన్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో నిర్వహించిన అడ్వాన్సెస్ ఇన్ అప్లయిడ్ ఫిజిక్స్ అంతర్జాతీయ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అప్లయిడ్ ఫిజిక్స్‌పై పరిశోధన ఫలితాలను యూ నివర్సిటీలు పరస్పరం ఇచ్చి పుచ్చుకోవాలన్నారు. దీనికోసం మౌలానా యూనివర్సిటీ వేదికను ఏర్పాటు చేయడం మంచి విషయమన్నారు. ఈ సదస్సులో మనూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ పీఎఫ్ రహమాన్, ప్రొఫెసర్ మహ్మద్ రఫీక్ అబుతాలిబ్, ప్రొఫెసర్ అలీమ్ హెచ్‌బాష, డాక్టర్ మహ్మద్ సిద్దిఖీ పాల్గొన్నారు.

బీఎస్‌ఎఫ్ హెచ్‌సీయూ నూతన కమిటీ

రాయదుర్గం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బహుజన స్టూడెంట్స్ ఫ్రంట్ సంఘానికి కొత్తకమిటీని ఎన్నుకున్నారు. బీఎస్‌ఎఫ్ కన్వీనర్ చిలుక హరీష్, మాజీ అధ్యక్షుడు జోగు రమేష్, సీనియర్ నాయకులు కత్తి అనిల, అసుర పరశు ఆధ్వర్యంలో నూతన కన్వీనర్‌గా గుంటి రోహిత్, అధ్యక్షుడిగా అంజ ఎర్రోళ్లను నియమించారు. ఉపాధ్యక్షుడిగా రచన, దివాకర్, ఆశ్చర్యలను ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా సంధ్యపోగు ప్రసన్న, నవీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హైదర్‌నగర్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): వెస్ట్రన్‌హిల్స్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11.30నుంచి 12గంటల వరకు అడ్డగుట్ట రోడ్‌నెంబర్ 1నుంచి 7, వెస్ట్రన్‌హిల్స్, ఆదిత్యనగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ దయానంద్ తెలిపారు. హెచ్‌ఎంటీహిల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1నుంచి 1.30గంటల వరకు హెచ్‌ఎంటీహిల్స్, అడ్డగుట్టలో, పీజేఆర్‌నగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో ఎన్టీఆర్‌నగర్, జన్మభూమికాలనీ, శంషిగూడలో విద్యుత్ సరఫరా ఉండదు. అదేవిధంగా ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పీజేఆర్‌నగర్, సుభాష్‌చంద్రబోస్‌నగర్, కమలమ్మనగర్, శివాజీనగర్, ఎన్టీఆర్‌నగర్, కేటీఆర్‌నగర్, జయశంకర్‌కాలనీ, పీజేఆర్‌నగర్, ఎల్లమ్మబండ, మహవీర్‌నగర్, జన్మభూమి కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదు.

• ఆక్రమణల తొలగింపు



దిమ్మెను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని ఆక్రమణలను అధికారులు తొలగించారు. చింతల్ నుంచి కాకతీయనగర్, ప్రసూననగర్, మల్లికార్జుననగర్ తదితర ప్రాంతాల్లో.. దుకాణాల ఎదుట నిర్మించిన దిమ్మెలను పగులగొట్టారు. పాన్‌డబ్బాలను తొలగించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతుందనే ఫిర్యాదుల మేరకు అధికారులు చర్యలకు పూనుకున్నారు.

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి)

• చెత్త'శుద్ధి'


చెత్త కుప్పలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

గాజులరామారం సర్కిల్.. చింతల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 'పేరుకుపోయిన చెత్త కుప్పలు' పేరిట ఇటీవల ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. భగత్‌సింగ్‌నగర్ నుంచి హెచ్‌ఎంటీ కాలనీకి వెళ్లే రోడ్డులో పేరుకుపోయిన చెత్త కుప్పలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) :

• గుంత.. చింత


మహాదేవపురం చౌరస్తాలో కంకర తేలిన రోడ్డు

గాజులరామారం డివిజన్ మహాదేవపురం చౌరస్తా రోడ్డులో గుంతలు పడి రెండు నెలలు గడుస్తున్నాయి. నిత్యం వేలాది వాహనాలు దేవేందరనగర్, గాజులరామారం, కైసర్‌నగర్‌కు ఈ రోడ్డు గుండా వెళ్తుంటాయి. రోడ్డుపై తేలిన కంకరతో రాత్రి సమయంలో ప్రయాణించే బైకిస్టులు జారి పడి గాయాలపాలవుతున్నారని స్థానికులు తెలుపుతున్నారు.

-గాజులరామారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి)

• 'పచ్చ'దనం



పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఉన్న పచ్చని చెట్లు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద పచ్చదనం కనువిందు చేస్తోంది. స్టేషన్ చుట్టూ పచ్చని చెట్లు, స్వచ్ఛమైన గాలులు ఆహ్లాద వాతావరణాన్ని తలపిస్తోంది. ముఖ ద్వారం ముందే వేప, సపోట, కొబ్బరి, మామిడి చెట్లు దర్శనమిస్తున్నాయి. అయితే వివిధ కేసులు, ఫిర్యాదుల కోసం వచ్చేవారు వీటి కింద సేదతీరుతున్నారు.

పేట్‌బషీరాబాద్, 21ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి):

భక్తిభావం పెంపొందించుకోవాలి


బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

పేట్‌బషీరాబాద్, 21ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): దేవుళ్లను స్మరించుకొన్నప్పుడే ప్రజలకు ప్రశాంతత దొరుకుతుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. శుక్రవారం జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్‌కార్యాలయంలో జీడిమెట్లలో ఉన్న మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను దేవాలయ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. స్వామి జాతర తెలంగాణ.. కొమరవెల్లి మల్లన్న జాతరలాగే ఇక్కడ జరుగుతుందన్నారు. ఈనెల 27 నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గొరిగే బాలప్ప, ఎల్లప్ప, జీతయ్య, వెంకటేష్, ఆంజనేయులు, గొరిగే బాలమల్లేష్, కాలే నగేష్, బాలమల్లేషులు పాల్గొన్నారు.

మరో కార్యక్రమంలో...

ఈనెల 24 నుంచి మూడు రోజులపాటు సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీలోని ద్వాదశ జ్యోతిర్లింగాల దేవస్థానంలో జరిగే శివరాత్రి మహోత్సవ పోస్టర్‌ను కూడా ఎమ్మెల్యే వివేకానంద ఆవిష్కరించారు. అలాగే దుండిగల్ మున్సిపాలిటీలోని బౌరంపేట్‌లోని భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి కల్యాణమహోత్సవ కరపత్రాన్ని ఆయన సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఫాక్స్ చైర్మన్ ఎం. బాల్‌రెడ్డి, దేవాలయ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు ప్రశాంత నిలయాలు


వార్షికోత్సవంలో డాక్టర్ మల్లారెడ్డి

దుండిగల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి అన్నారు. బౌరంపేట- ఇందిరమ్మ కాలనీలో ఆంజనేయస్వామి గుడి 3వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీసరి కృష్ణారెడ్డి, బెంబడి బుచ్చిరెడ్డి, సీతారామ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

ఈ చెత్తను శుభ్రం చేయరూ..


ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గుబురుగుట్ట ప్రభుత్వ పాఠశాల పక్కనున్న ఖాళీ స్థలంలో చెత్త పేరుకుపోయింది. మధ్యాహ్నం భోజన సమయంలో గాలి వచ్చినప్పుడల్లా విద్యార్థులు తినే ప్లేట్లలో కాగితాలు, చెత్తాచెదారం పడుతోంది. ఈ విషయమై సంబంధిత అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానిక నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): నూతన గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా కాంగ్రెస్ శేరిలింగంపల్లి పార్టీ ఇన్‌చార్జి, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ, పదేళ్ల తర్వాత కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానన్నారు.

కులగణనపై అవగాహన

రాయదుర్గం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): కొండాపూర్ అంజయ్యనగర్ వార్డు కార్యాలయంలో శుక్రవారం కులగణన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు తిరుమలగిరి సురేందర్, జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ శ్రవణ్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది హాజరయ్యారు. కుల గణనపై అవగాహన పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కార్యక్రమాలపై చర్చించారు. ఈ కులగణన ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సమర్థవంతంగా అమలు చేయొచ్చన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఆయా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు తిరుమలగిరి సురేందర్, జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ శ్రవణ్‌రెడ్డి

ప్రాణాలకు భరోసా ఏది?

ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిన జనంతో ప్రయాణిస్తున్నాయి. కానీ ఫుట్‌బోర్డు వద్ద యువత, మహిళలు వేలాడుతూ ప్రమాదభరిత ప్రయాణం చేస్తున్నారు. పట్టుజారితే పరిస్థితి ఏంటి? అనే ప్రశ్న తలెత్తుతోంది. నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి గమ్య స్థానాలకు పయనమవుతున్నారు. గతంతో పోలిస్తే బస్సు సంఖ్య తగ్గడం.. అందుకు తగినట్లు సర్వీసులు పెంచకపోవడమే కారణమని పలువురు ప్రయాణికులు, విద్యార్థులు పేర్కొంటున్నారు.



- కిక్కిరిసిన జనంతో ఆర్టీసీ బస్సులు
- ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్న యువత
- ఒక వేళ పట్టుజారితే పరిస్థితి ఏంటి?
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- గతంతో పోలిస్తే తగ్గిన సర్వీసులు
- పట్టించుకోని అధికారులు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్యాసింజర్ ఆటో అయితే పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దంటారు. బైక్‌పై త్రిపుల్ రైడింగ్ చేయొద్దని హెచ్చరిస్తారు. మరి ఆర్టీసీ బస్సులు రెండింతల జనంతో ప్రయాణిస్తుంటే మాత్రం ఎవరూ నోరుమెదపరు.. ఫుట్ బోర్డు ప్రయాణం ప్రమాదమని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో యువత గమ్యస్థానాలకు చేరుతోంది. ప్రధానంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారాలు వారి అవసరాల కోసం అధికంగా వెళ్తుంటారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వాలు రవాణా సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. కానీ ఉన్న వాటితోనే నెట్టుకొస్తున్న పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది. గతంలో పోల్చితే ఆర్టీసీ బస్సుల సంఖ్య పూర్తిగా తగ్గిందని, చేసేదేమీ లేక ఫుట్‌బోర్డు ప్రయాణాలు చేయాల్సి వస్తుందని విద్యార్థులు పేర్కొన్నారు. ఒకవేళ ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్న


బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

వారు పట్టుతప్పి కింద పడిపోతే.. అధిక లోడ్ వల్ల టైర్లు పేలితే ప్రాణనష్టం జరిగే అవకాశం లేకపోలేదని ప్రజానీకం , విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ రూట్లలో రద్దీ

నగరశివారులోని మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపల్లి, మైసమ్మ గూడ, బాచుపల్లి, దుండిగల్ తదితర ప్రాంతాలలో అత్యధికంగా విద్యాసంస్థలుంటాయి. అదే విధంగా పరిశ్రమలు సైతం ఎక్కువగానే ఉన్నాయి. విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు, పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులు రోజూ వేలల్లో ఉంటారు. అందుకు తగినట్లుగా బస్సు సర్వీసులు లేవు. దీంతో ఉన్న సర్వీసుల్లోనే ప్రయాణించాల్సి వస్తుందని పలువురు తెలుపుతున్నారు.

సర్వీసులు పెంచాలి

నేను అల్వాల్ ప్రాంతంలో నివసిస్తున్నాను. కొంపల్లిలోని ఓ కళాశాలలో చదువుకునేందుకు రోజూ ఆర్టీసీ బస్సునే ఆశ్రయిస్తున్నా. అదే కళాశాల బస్సు అయితే ఆ ఫీజులు అధికం దీంతో బస్సులోనే ప్రయాణిస్తున్నా. గతంలో బస్సు సర్వీసులు అధికంగా ఉండేవి. ఇప్పుడు ఆ స్థాయిలో లేదు. ఉదయం 9:15 గంటలకు తరగతులు ప్రారంభమవుతాయి. సుచిత్ర చౌరస్తాలో బస్సు కోసం ఒక్కోసారి అరగంటకు పైగా ఎదురు చూడాలి. ఒక్కోసారి కొంపల్లి ప్రజయ్ స్టాప్ వద్ద బస్సులను ఆపడం లేదు. చేసేదిలేక ఫుట్‌బోర్డులో నిల్చోని ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఆర్టీసీ సంస్థ వారు సర్వీసులను పెంచాలి. **- హర్షిత, డిగ్రీ విద్యార్థిని**

కెపాసిటీ ప్రకారమే తీసుకెళ్లాలి

మోటార్ వెహికల్ చట్ట ప్రకారం ఏ వాహనాలలోనైనా కెపాసిటీ ప్రకారమే ప్రయాణికులను తీసుకెళ్లాలి. నిబంధనలు పాటించకుంటే వాహన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- వెంకట్‌రెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ

సమస్యలపై నేరుగా సంప్రదించవచ్చు

- త్వరలో కమిషనరేట్ పరిధిలో నూతన స్టేషన్లు
- సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి
- ప్లేజోన్, రెస్ట్‌హౌస్ ప్రారంభం

జీడిమెట్ల,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందిస్తున్నామని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. శుక్రవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా స్టేషన్ ఆవరణలో వ్యాక్సన్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంతో ఏర్పాటు చేసిన చిన్నారుల ప్లేజోన్ , మహిళా ఉద్యోగులు, వివిధ పనుల మీద స్టేషన్‌కు వచ్చే తల్లుల ఫీడింగ్ రూమ్, రెస్ట్ రూమ్‌ను ప్రారంభించారు. అనంతరం సిబ్బందికి విధుల్లో పాటించాల్సిన సూచనలు సలహాలిచ్చారు. అదేవిధంగా డీసీపీ కె.సురేష్‌కుమార్, ఏసీపీ జి.హనుమంతురావు, సీఐ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్యలతో వివిధ అంశాలపై చర్చించారు. ప్రజలకు అందిస్తున్న సేవలను గురించి తెలుసుకున్నారు. పెరుగుతున్న నేరాలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు.

అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు ఐఎస్‌ఓ సర్టిఫికెట్ వచ్చిందన్నారు. దానికి అనుగుణంగా అన్ని పోలీస్ స్టేషన్‌లలో ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాలకు


ప్లేజోన్‌లో చిన్నారులతో అవినాష్‌మహంతి

అనుగుణంగా సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉన్నామన్నారు. భూకబ్జాదారులు, రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉందని తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో అవసరమైన ప్రాంతాల్లో నూతన పోలీస్‌స్టేషన్‌లు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు వివరించారు. స్టేషన్‌కు వచ్చే తల్లుల చిన్నారులు, అలాగే సిబ్బంది పిల్లలు ప్లేజోన్‌లో ఆడుకోవచ్చునన్నారు. మహిళా ఉద్యోగులు విశ్రాంతి తీసుకోవడానికి రెస్ట్‌రూమ్‌లు ఉపయోగపడతాయన్నారు. ప్రజలు నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు బాధితులు తనను నేరుగా కలవచ్చునన్నారు. ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ వనజ అల్వాల, డైరెక్టర్‌లు సంతోష్‌పటేల్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.


యంత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

- ఉపాధ్యక్షుడు డాక్టర్ సీవీఎస్ కిరణ్
- 'కన్వర్జెన్స్ 2ఐ 25' వార్షికోత్సవం ప్రారంభం

నిజాంపేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఇంజినీరింగ్ రంగంలో దేశంలో పురోగతిలో ఉన్నా కానీ ఇతర దేశాల మీద కొన్ని విడిభాగాలకైనా ఆధారపడక తప్పని పరిస్థితి అని స్కైరూట్, ఏరోస్పేస్ సంస్థలో మెటీరియల్స్ అండ్ స్ట్రాటజిక్ ఇనిషియేటివ్స్ విభాగ ఉపాధ్యక్షుడు డాక్టర్ సీవీఎస్ కిరణ్ తెలిపారు. ప్రగతినగర్‌లో వీఎన్‌ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో కన్వర్జెన్స్ 2ఐ 25 వార్షికోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉత్పత్తి రంగ సమగ్రాభివృద్ధికి తయారీకి సంబంధించిన పద్ధతులు, ముడిసరుకులు, విడిభాగాలు అన్నీ కూడా దేశంలోనే తయారు చేసుకుంటేనే పరిపూర్ణత సాధ్యమన్నారు. విజ్ఞానజ్యోతి ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, దివంగత శుభానందరావు నిరంతరం పరిశోధనారంగం గురించి, సంస్థ సాంకేతికాభివృద్ధి గురించి ఆలోచించేవారన్నారు. కన్వర్జెన్స్ పేరిట జరుగుతున్న సాంకేతికోత్సవం సందర్భంగా కళాశాలలోని విద్యార్థులు అధ్యాపకులు ఆయన దార్శనికత నుంచి ప్రేరణ పొందాలన్నారు. ఈ కార్యక్రమం రెండురోజులపాటు కొనసాగనుందన్నారు. అంతకు ముందు విద్యార్థులు రూపొందించిన యంత్రాలను పలువురు సందర్శించారు. కార్యక్రమంలో పూర్వాధ్యక్షులు డాక్టర్ డీఎన్ రావు, కళాశాల ప్రధాన అధ్యక్షుడు డాక్టర్ సీడీ నాయుడు, సంచాలకులు డాక్టర్ బీ. చెన్నకేశవరావు, సభ్యుడు కె. హరిచంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజులరామారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం విద్యుత్ సబ్-స్టేషన్ 11 కేవీ కైలాస్‌హిల్స్, శంషీగూడ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతు వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయ కలుగుతుందని ఏఈ చైతన్య భార్గవ్ తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మహాదేవపురం, బాలయ్యబస్తీ, ఎస్ఎస్ మోటార్స్‌లైన్, మోంట్రిడ్జ్ స్కూల్ లైన్‌లో విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేట్‌బషీరాబాద్: రంగారెడ్డి బండ విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని వెన్‌సాయి ఎన్‌క్లేవ్, ప్రాగా టూల్స్ రామోజీనగర్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల వల్ల కరెంట్ సప్లయిలో అంతరాయం కలుగుతుందని ఏఈ జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వెన్‌సాయి ఎన్‌క్లేవ్, వానమ్స్ సెర్లక్, కళ్యాణ్‌కన్‌స్ట్రక్షన్స్ , హర్ష హాస్పిటల్, డీమార్ట్ వెనుక, జేబీబాబు లైన్ ఏరియా, మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు ప్రాగా టూల్స్ కాలనీ ఏరియా, బీహెచ్‌ఈఎల్ విస్టా, కోణార్క్ ఆస్పత్రి ఏరియా, ఎన్‌సీఎల్ హోమ్స్, శాటిలైట్ టౌన్‌షిప్, జీఎల్‌ఆర్ ఎన్‌క్లేవ్, రామారాజునగర్, ఫ్రెండ్స్ సర్కిల్, హిల్‌వైన్స్ , పరిపూర్ణఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

దుండిగల్ పీఎస్‌లో కుమార్తె ఫిర్యాదు

దుండిగల్, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): కుమార్తెను చూడటానికి వచ్చి తిరుగు ప్రయాణంలో మహిళ కనిపించకుండాపోయింది. ఈ సంఘటన దుండిగల్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగరకర్నూల్‌కు చెందిన కుమ్మర ప్రాంతంలోని లక్ష్మీతండాకు చెందిన సబావత్ మల్లేష్ భార్య జిజాలీ(40), ఈనెల 16న దుండిగల్‌లో నివాసముంటున్న తన కుమార్తె నేనావత్ నీలా దగ్గరకు వచ్చింది. ఈనెల 19న సొంతూరుకు వెళ్లేందుకు గాను గండిమైసమ్మ చౌరస్తాలో సికింద్రాబాద్ బస్సు ఎక్కింది. ఆ తర్వాత కనిపించకుండా పోయింది.. ఆమె తండాకు చేరుకోలేదని సమాచారం తెలుసుకున్న కుమార్తె.. దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని వారు దర్యాప్తు చేస్తున్నారు.


జిజాలీ(ఫైల్)

కట్టమైసమ్మ ఆలయ హుండీల లెక్కింపు


హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

షాపూర్‌నగర్, 21ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం కట్టమైసమ్మ దేవాలయం హుండీలను శుక్రవారం సిబ్బంది లెక్కించారు. రూ.3, 03, 856ల ఆదాయం చేకూరింది. ఈ కార్యక్రమాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి ప్రణీత్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని దేవాలయ ఈవో కృష్ణమాచార్యులు తెలిపారు. ఆలయం ఎండోమెంట్ పరిధిలోకి వెళ్లిడం విదితమే. ఆ మేరకు జాతరకు వచ్చిన ఆదాయాన్ని ఇప్పుడు లెక్కించారు.

గాంధీనగర్‌కు పోస్టాఫీస్ తరలింపు



పోస్టాఫీస్ కౌంటర్ వద్ద వేచి ఉన్న ప్రజలు

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఐడీపీఎల్ కాలనీలోని పోస్టాఫీస్‌ను రంగారెడ్డినగర్ డివిజన్.. గాంధీనగర్ పారిశ్రామిక వాడకు మార్చారు. స్రామాట్ ఫంక్షన్‌హాల్ భవనం మొదటి అంతస్తుతో తన కార్యకలాపాలు కొనసాగిస్తుంది. ఆధార్‌కార్డులో పేర్లు చేర్పులు మార్పులు, కొత్త పేర్లను చేర్చుకునేందుకు అవకాశం కల్పించామని అధికారులు తెలిపారు. ఈ సేవలను ప్రజలు , కార్మికులు వినియోగించుకోవాలని కోరారు.

మాతృభాషను ఆదరించాలి

తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానందరావు

నిజాంపేట్,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): మాతృభాషను ప్రతిఒక్కరూ గౌరవించి ఆదరించాలని తెలుగువర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశభాషలందు తెలుగు లెస్సా అని కీర్తించబడిన మధురాతిమధురమైన భాష మన మాతృభాష అని తెలిపారు. ప్రతిఒక్కరూ మాతృభాషపై మమకారంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నోరిరాజేశ్వరరావు, కాంచనపల్లి గోవర్ధన్‌రాజు, బి.రాధాసారంగపాణిపాల్గొన్నారు.